
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
5
ఆదివారం 5 మే 2024





సంగారెడ్డిలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

మల్లన్నసాగర్ భూనిర్వాసితులకు అండగా ఉంటాం

- సీఎం దగ్గర కూర్చుని సమస్యలను పరిష్కరింపజేస్తా
- వచ్చే ఎన్నికల్లో సంగారెడ్డి నుంచి జయారెడ్డి పోటీ
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

గజ్వేల్, మే 4: మల్లన్నసాగర్ భూనిర్వాసితులకు అండగా ఉంటామని సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి పేర్కొన్నారు. మెదక్ లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్‌కు మద్దతుగా సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ రాహుల్‌గాంధీని ప్రధాన మంత్రిని చేయడమే మనందరిని లక్ష్యమని, అందుకు మెదక్ నుంచి నీలం మధును ఎంపీగా గెలిపించాలని కోరారు. గజ్వేల్ నియోజకవర్గ పరిధిలో 25వేల మెజారిటీ ఇస్తే సీఎం రేవంత్‌రెడ్డి వద్ద కూర్చుని మల్లన్నసాగర్ భూనిర్వాసితులకు సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో వచ్చే ఐదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని, కాంగ్రెస్ కార్యకర్తలను ఎవరూ ఇబ్బంది పెట్టలేరని భరోసా ఇచ్చారు. పార్టీ వారికి ఏ కష్టం వచ్చినా తానే స్వయంగా వచ్చి అండగా నిలబడతానని చెప్పారు. భవిష్యత్తులో ఎన్నికల్లో పోటీ చేసేందుకు యువత సిద్ధం కావాలని కోరారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సంగారెడ్డి నుంచి పోటీ చేసేందుకు తన కూతురు జయారెడ్డిని సిద్ధంగా ఉండాలని చెప్పానని జగ్గారెడ్డి తెలిపారు. గజ్వేల్‌లో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి కూతురు అంక్షారెడ్డి కూడా వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉందో.. లేదో? తెలియదన్నారు. అంతకు ముందు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ భూనిర్వాసితులకు అండగా ఉంటుందని భరోసానిచ్చారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, ఎలక్షన్‌రెడ్డి, భూంరెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షారెడ్డి, టీపీసీసీ నాయకులు నాయిని యాదగిరి, సాజిద్‌బేగ్, సర్దార్‌ఖాన్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మాజీ మునిసిపల్ చైర్మన్ గాడి పల్లి భాస్కర్, పట్టణాధ్యక్షుడు మోహన్నగారి రాజు, ప్రధాన కార్యదర్శి నక్క రాములు తదితరులున్నారు.



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

'నీట్'కు ఏర్పాట్లు పూర్తి

సంగారెడ్డిలో తొమ్మిది కేంద్రాలు

పరీక్ష రాయనున్న 3,619 మంది

సంగారెడ్డి అర్బన్, మే 4 : వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నేడు నిర్వహించనున్న 'నీట్ ప్రవేశ పరీక్ష కోసం సంగారెడ్డిలో అన్ని ఏర్పాట్లు చేశారు. నీట్ కోసం పట్టణంలో తొమ్మిది కేంద్రాలను ఏర్పాటు చేశారు. సంగారెడ్డి పట్టణం శాంతినగర్‌లోని సెయింట్ ఆంథోనీస్ జూనియర్ కళాశాల, సెయింట్ ఆంథోనీస్ డిగ్రీ కళాశాల, విద్యానగర్‌లోని సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్, సెయింట్ పీటర్స్ హైస్కూల్, రిషి హైస్కూల్, పయనీర్స్ స్కూల్, సెయింట్ ఆర్నాల్డ్స్, కరుణ హైస్కూల్, ఎస్వీ జూనియర్ కళాశాలల్లో నీట్ నిర్వహించనున్నారు. ఆయా కేంద్రాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.20 గంటల వరకు నిర్వహించనున్న పరీక్షకు 3,619 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ఆఫ్‌లైన్‌లో పరీక్ష నిర్వహిస్తారు. పరీక్షల నిర్వహణకు 12 మంది పరిశీలకులను నియమించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో నిర్వహించే నీట్ పరీక్షకు జిల్లాకేంద్రంలో పకడ్బందీ ఏర్పాట్లు పూర్తిచేశామని సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ జ్యోతిరెడ్డి వివరించారు. అభ్యర్థులను ఉదయం పరీక్షకు 11 గంటల నుంచి.. మధ్యాహ్నం పరీక్షకు 1.30 గంటల వరకు మాత్రమే కేంద్రాల్లోకి అనుమతిస్తామని పేర్కొన్నారు. ఆలస్యంగా వచ్చినవారిని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని అధికారులు తెలిపారు. పరీక్ష ముగిసే వరకు ఎవరినీ బయటకు పంపించరని తెలియజేశారు.

అభ్యర్థులు ఈ నిబంధనలు పాటించాల్సిందే

నీట్ ప్రవేశ పరీక్ష రాసే అభ్యర్థులు అడ్మిట్ కార్డుతో పాటు ఒరిజినల్ ఆధార్‌కార్డు, ఒక జిరాక్స్ కాపీ, గుర్తింపు కార్డు, మూడు ఫొటోలు, వాటర్‌బాటిల్ వెంట తెచ్చుకోవాలని అధికారులు తెలిపారు. బూట్లు, నగలు, మెటల్ వస్తువులు ధరించి వస్తే అనుమతించమని తెలిపారు. పేపర్లు, జామెట్రీబాక్సు, పెన్సిల్ బాక్సు, ప్లాస్టిక్‌పౌచ్‌లు, క్యాలిక్యులేటర్లు, స్కేళ్లు, రైటింగ్‌ప్యాడ్, వ్యాలెట్, హ్యాండ్‌బ్యాగ్, టోపీ, బెల్టు, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురావడానికి అనుమతి లేదని పేర్కొన్నారు. అభ్యర్థులు నిబంధనలు కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు.

పోలింగ్ సిబ్బంది పారదర్శకంగా విధులు నిర్వర్తించాలి

- ఈవీఎంల కమీషనింగ్‌లో లోటుపాట్లు లేకుండా చూడాలి
- మెదక్ లోక్‌సభ ఎన్నికల పరిశీలకులు సమీర్ మాధవ్ కుర్కోటి



గజ్వేల్ ఐవోసీలో ఈవీఎంల కమీషనింగ్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకులు సమీర్ మాధవ్, కలెక్టర్ మనూచౌదరి

గజ్వేల్, మే 4: పోలింగ్ సిబ్బంది అత్యంత పారదర్శకంగా విధులను నిర్వర్తించాలని మెదక్ లోక్‌సభ ఎన్నికల పరిశీలకులు సమీర్ మాధవ్ కుర్కోటి సూచించారు. గజ్వేల్ పట్టణంలోని ఐవోసీలో నిర్వహించిన ఈవీఎంల కమీషనింగ్ ప్రక్రియను సిద్దిపేట జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి మనూచౌదరితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సమీర్ మాధవ్ మాట్లాడుతూ ఈవీఎంల కమీషనింగ్‌లో లోటుపాట్లు లేకుండా చూడాలని, ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం చేయాలని సూచించారు. ఈవీఎం మెషీన్ల కమీషనింగ్ ప్రక్రియ పూర్తయిన వెంటనే సీల్ వేయాలని, కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీప్యాట్ యూనిట్‌లను అనుసంధానం చేసి పూర్తిస్థాయిలో సీల్ వేయాలన్నారు. ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ ప్రక్రియపై ఆయా నియోజకవర్గ ఏఆర్‌వోలకు పలు సూచనలు చేశారు. మాక్ పోల్ ప్రక్రియ, పోలింగ్‌లో ప్రతి ప్రక్రియకు సంబంధించిన సర్టిఫికేట్లను నింపే విధానం గూర్చి అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఆయనవెంట గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్, తహసీల్దారు శ్రావణ్‌కుమార్ తదితరులున్నారు.

65 సెల్‌ఫోన్లు రికవరీ

బాధితులకు అందజేసిన సీపీ అనురాధ




సెల్‌ఫోన్లు అందుకున్న వారు

సిద్దిపేట క్రైం, మే 4 : పడిపోయిన, చోరీకి గురైన 65 సెల్‌ఫోన్‌లను రికవరీ చేసి శనివారం కమిషనర్ కార్యాలయంలో సీపీ డాక్టర్ బి.అనురాధ సంబంధిత బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సెల్‌ఫోన్ ఎక్కడ పడిపోయిన ఎవరైనా దొంగిలించినా వెంటనే సీఈఐఆర్‌లో డాటా నమోదు చేస్తే ఫోన్ రికవరీ చేసే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. 2023 నుంచి ఏప్రిల్ 20వ తేదీ నుంచి ఇప్పటివరకు 660 సెల్‌ఫోన్లను సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా గుర్తించి స్వాధీనం చేసుకొని సంబంధిత బాధితులకు అప్పగించినట్లు తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో సీఐఆర్ పోర్టల్‌లో 2,210 మంది సెల్‌ఫోన్‌లు పోయినట్లు నమోదు చేసుకున్నారని అందులో నుంచి 660 ఫోన్లు రికవరీ చేశామని, మిగతా ఫోన్లు త్వరలోనే గుర్తించి సంబంధిత బాధితులకు అప్పగిస్తామని తెలిపారు.

కూలిన చెట్టు

కారణమైన వ్యక్తికి రూ.10వేల జరిమానా



పడిపోయిన చెట్టు

గజ్వేల్, మే 4 : చెట్టు నేలకూలడానికి కారణమైన ఒకరికి రూ.10వేల జరిమానా విధించిన సంఘటన శనివారం గజ్వేల్ పట్టణంలో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని ఓ బైక్ మెకానిక్ షాపు ఎదుట చెట్టు మొదలులో మంటపెట్టడంతో ఆ చెట్టు నేలకూలింది. దీనికి కారణమైన బైక్ మెకానిక్‌కు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య రూ.10వేల జరిమానాను విధించారు. పట్టణంలో హరితహారం చెట్లను కొట్టివేసినా, ఇతరత్రా చర్యలకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.



'ఇటీవల సిద్దిపేట వేదికగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మాట్లాడినట్లుగా కొన్ని వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా దుమారం రేపాయి. రిజర్వేషన్ల అంశం గురించి ఆయన మాటలను మార్ఫింగ్ చేసి దుష్ప్రచారం చేశారని బీజేపీ నేతలు మండిపడ్డారు. పలువురు కాంగ్రెస్ నేతలపై కేసులు కూడా నమోదు చేశారు. ఈ సంఘటనతో సిద్దిపేట పేరు మార్మోగింది.'

'తాజాగా మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి మాట్లాడినట్లుగా ఒక ఫేక్ ఆడియో వైరల్‌గా మారింది. ప్రత్యేక టెక్నాలజీతో ఆయన గొంతును, మాటలను మిక్స్ చేసి దుష్ప్రచారం చేస్తున్నట్లు ఆ పార్టీ శ్రేణులు ఆరోపిస్తున్నారు. ఇలాంటి చీప్ ట్రిక్స్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.'

మెదక్ లోక్‌సభ సెగ్మెంట్‌ల పరిధిలోనే చోటుచేసుకున్న ఈ రెండు సంఘటనలు చర్చనీయాంశంగా మారాయి. అధునాతన టెక్నాలజీతో, గ్రాఫిక్స్ ద్వారా మార్ఫింగ్ చేసి రాజకీయ పార్టీల నడుమ వివాదాలను సృష్టిస్తున్నారు. బరిలో ఉన్న అభ్యర్థులకు సంబంధించి విద్వేషకర పోస్టులు, తప్పుడు ఫొటోలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం సాధారణంగా మారింది. దీంతో పోలీస్ యంత్రాంగం సోషల్ మీడియాపై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది.

– ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, మే 4

ఖాకీ కన్ను

సోషల్ మీడియాపై గట్టి నిఘా

- ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు
- నిరంతరం పర్యవేక్షిస్తున్న ఐటీ కోర్ బృందం
- నెట్టింట పార్టీల ప్రచారశైలిపైనా దృష్టి
- ఫిర్యాదులు చేస్తే చర్యలకు సన్నద్ధం

పార్లమెంటు ఎన్నికలు ముగిసేదాకా సిద్దిపేట పోలీస్ కమిషనరేట్‌లో ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో సోషల్ మీడియాను నిరంతరం పర్యవేక్షించడానికి ఐటీ కోర్ బృందాన్ని నియమించారు. 24 గంటల పాటు సోషల్ మీడియాలో పెడుతున్న పోస్టులను పరిశీలించడం వీరి ప్రధాన బాధ్యత. ముఖ్యంగా ఎన్నికల నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీల నేతలు, కార్యకర్తల పోస్టులపై దృష్టి పెడుతున్నారు. ప్రత్యర్థులను కించపరిచేలా, ఓటర్లలో విద్వేషం సృష్టించేలా ఉంటే గుర్తిస్తున్నారు. అదే విధంగా ఎవరైనా తప్పుడు పోస్టుల గురించి ఫిర్యాదు చేస్తే వెంటనే విచారణ జరుపుతున్నారు. గతంలో ఫేక్ ఖాతాలు, వాట్సాప్ పోస్టుల వ్యవహారం గురించి తెలుసుకోవాలంటే హైదరాబాద్‌లోని ఐటీ సెల్‌ను ఆశ్రయించాల్సి వచ్చేది. ప్రస్తుతం ఆ టెక్నాలజీ సిద్దిపేట పోలీస్ కమిషనరేట్‌లోనూ అందుబాటులోకి తెచ్చారు. దీంతో ఫేక్ ఖాతాలను గుర్తించడం సులభతరమైంది.

ఆ ఖాతాలపై ఫోకస్..

వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం, ఎక్స్ ఖాతాలతో పాటు యూట్యూబ్, రీల్స్ వీడియోలు, పోస్టులపై ఐటీ కోర్ విభాగం నిఘా సారించింది. అన్ని మండలాల్లోని సోషల్ మీడియా గ్రూపులను పరిశీలిస్తున్నారు. సొంత పార్టీ గురించి, వారి అభ్యర్థులకు అనుకూలంగా ప్రచారం చేసుకోవడంలో ఎలాంటి తప్పులేదని, ప్రత్యర్థులపై అసభ్యంగా ప్రచారం చేస్తేనే పరిగణనలోకి తీసుకునేలా పోలీసు యంత్రాంగం వ్యవహరిస్తోంది. రెచ్చగొడుతూ పోస్టులు పెట్టే ఫేక్ ఖాతాలపైనా దృష్టి పెట్టారు. సంబంధిత ఫేస్‌బుక్‌లో వారి వివరాలేవీ లేకున్నా ఇతరుల గురించి ఇష్టారాజ్యంగా ప్రచారం చేసేవారిని గుర్తిస్తున్నారు.

సోషల్ మీడియాలో 'వార్'

ఓవైపు ఎండలు మండుతుండడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఓటర్లను నేరుగా కలవలేకపోతున్నారు. ఉదయం, రాత్రి వేళల్లో మాత్రమే ప్రచారం చేస్తున్నారు. మధ్యాహ్నం, సాయంత్రం సమయాల్లో కాలు బయటపెట్టడం లేదు. అందుకే సోషల్ మీడియాను తమ ప్రచారానికి వేదికగా ఎంచుకుంటున్నారు. యూట్యూబ్ వీడియోలు ఓపెన్ చేసినా, ఫేస్‌బుక్ ఖాతాలు తెరిచినా, వాట్సాప్ గ్రూపుల్లో తొంగిచూసినా అభ్యర్థుల ప్రచారమే కనిపిస్తోంది. సోషల్ మీడియా ఖాతాలు తెరవగానే ఆయా పార్లమెంటు నియోజకవర్గాల్లో పోటీచేస్తున్న అభ్యర్థుల ప్రచార వీడియోలు, ఫొటోలు ప్రత్యక్షమవుతున్నాయి. అంతేగాకుండా ఫేస్‌బుక్ ద్వారా అభ్యర్థులు తమ ప్రచారాన్ని లైవ్‌లో చూసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇక గ్రామాలు, పట్టణాల్లోని వాట్సాప్ గ్రూపుల్లో పోటాపోటీగా పోస్టులు పెట్టుకుంటూ నెట్టింట్లోనే వాగ్వాదాలు చేసుకుంటున్న పరిస్థితి నెలకొన్నది. ఫేస్‌బుక్‌లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ప్రచారానికి వారం రోజులు మాత్రమే సమయం ఉండడంతో సోషల్ మీడియాను విస్తృతంగా వినియోగించేలా కసరత్తు చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఒకరిపై ఒకరు సోషల్ మీడియా వేదికగా బురద చల్లుకుంటున్నారే తప్ప పోలీసులకు ఎలాంటి ఫిర్యాదులు చేయకపోవడం కొసమెరుపు.



ప్రధాన పార్టీల్లో 'సోషల్' కలవరం

- అభ్యర్థులు గతంలో చేసిన వ్యాఖ్యలు వైరల్

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మే 4 : సోషల్ మీడియాలో ప్రచారం ఫలితాలను తారుమారు చేస్తుందా? అన్న కలవరం ప్రధాన పార్టీల్లో నెలకొన్నది. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులు గతంలో చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్‌గా మారుతున్నాయి. కాంగ్రెస్ మెదక్ నియోజకవర్గ అభ్యర్థి నీలం మధు గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో పటాన్‌చెరు నియోజకవర్గం నుంచి బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేశారు. అప్పట్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన కాంగ్రెస్‌ను విమర్శిస్తూ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ తనను మోసం చేసిందని, ముదిరాజ్ బిడ్డలు ఒక్కరు కూడా ఆ పార్టీకి ఓటేయ్యవద్దని అప్పట్లో ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో ప్రచారం ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల అనంతరం ఆయన కాంగ్రెస్‌లో చేరి ఇప్పుడు అదే పార్టీ నుంచి లోక్‌సభకు పోటీ చేస్తున్నారు. ప్రస్తుతం ఆయన కాంగ్రెస్‌కు ఓటేయాలని, తనను గెలిపించాలని ప్రచారం చేస్తున్నారు. అప్పట్లో అలా.. ఇప్పుడు ఇలా.. అంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై ఆ పార్టీ వర్గాలు కలవరం వ్యక్తం చేస్తున్నాయి. మెదక్ నుంచే బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీలో ఉన్న పి.వెంకట్రామారెడ్డికి సంబంధించిన వీడియోను మార్ఫింగ్ చేసి, సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. కలెక్టర్‌గా ఉన్నప్పుడు ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్టు ప్రచారమవుతున్నాయి. ఈ వీడియోలపై ప్రజలు ఎలా స్పందిస్తారోనని గులాబీ పార్టీలో ఆందోళన వ్యక్తమవతున్నది. పోలింగ్ తేదీ దగ్గర పడుతున్న కొద్దీ ఇలాంటి వైరల్ వీడియోలు ఆయా పార్టీల్లో గుబులుపట్టిస్తున్నాయి.

హామీలు అమలు చేయమంటే.. పేగులు మెడలేసుకుంటా అంటావా?

- కేసీఆర్‌ను తిట్టడమంటే తెలంగాణ సమాజాన్ని తిట్టడమే : హరీశ్‌రావు

దుబ్బాక, మే 4 : 'తెలంగాణ తెచ్చినోడు, చావునోట్లే తలపెట్టినోడు.. పదేండ్లు ముఖ్యమంత్రిగా చేసినోడు.. ప్రజల కోసం కొట్లాడేటోడు.. నీకంటే ఎక్కువ వయస్సు ఉన్నాయనను పట్టుకుని, హామీలను అమలు చేయమంటే పేగులు మెడలేసుకుంటా.. కండ్లగుడ్లు పీకి గోటీలు ఆడుకుంటా.. నీ అంగిలాగు ఊడపీకుతా అంటావా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి' అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. కేసీఆర్‌ను తిట్టడమంటే తెలంగాణ సమాజాన్ని తిట్టినట్టేననీ, తిట్టడం కంటే రెండు మంచి పనులు చేసి, ప్రజల మనస్సు గెలుచుకోవాలని రేవంత్‌రెడ్డికి సూచించారు. శనివారం రాత్రి అక్బర్‌పేట-భూంపల్లి మండలం అక్బర్‌పేట చౌరస్తా వద్ద బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి మద్దతుగా హరీశ్‌రావు రోడ్‌షో నిర్వహించారు. అనంతరం దుబ్బాకలోని బస్టాండ్ వద్ద నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ హామీలను అమలు చేయకుండా ప్రజల గుండెలమీద తన్నిందని మండిపడ్డారు. ప్రశ్నించే గొంతు, ఉద్యమనేత కేసీఆర్‌కు ఈ ఎన్నికల్లో బలం ఇస్తే, కాంగ్రెస్ మెడలు వంచి తీరుతారన్నారు. కేసీఆర్ అధికారంలో ఉంటే ఎండకాలంలో కూడవెల్లి వాగు పారిందనీ, నెలకాగానే పింఛన్‌లు పడ్డాయన్నారు. కరోనా కాలంలోనూ రైతుబంధు వేశామని గుర్తుచేశారు. కేసీఆర్ తన హయాంలో దుబ్బాకలో వందపడకల ఆసుపత్రిని నిర్మించి, గర్భిణులకు ప్రసవం చేయడంతోపాటు కేసీఆర్ కిట్టును అందించామన్నారు. ఆనాడు వ్యవసాయానికి 24 గంటల కరెంటు అందించామని, ఇప్పుడు కనీసం 13 గంటల కూడా రావడంలేదన్నారు. దొంగరాత్రి కరెంటు ఇస్తూ, రైతులను బలి చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పుడు మోటర్లు కాలిపోతున్నాయనీ, పేలిపోయో ట్రాన్స్‌ఫార్మర్లు కనిపిస్తున్నాయన్నారు. కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని మోసం చేసిందన్నారు. రేవంత్ అడుగుపెట్టడమే రూ.50వేలకు తులం ఉన్న బంగారం రూ.75వేలకు చేరిందన్నారు. కాంగ్రెస్ వచ్చిందో లేదో కరువు వచ్చిందన్నారు. బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావును గత ఎన్నికల్లో ఉతికి ఆరేశారనీ, ఈసారి మరోసారి ఓడించాలని ఆయన కోరారు. బీజేపీ బీడీకార్మికుల నుంచి చాటగుంజుకునే ప్రయత్నం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, నాయకులు కత్తి కార్తీక, మనోహర్‌రావు, వెంకటనర్సింహారెడ్డి, ఆర్.రాజమౌళి, ఎర్రోల్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



దుబ్బాకలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

ఆశలపల్లకిలో..

నేటితో ముగియనున్న మల్లన్న ఆలయ కమిటీ పదవీకాలం

- కొత్త కమిటీలో చోటు కోసం ఆశావహుల ప్రయత్నాలు

చేర్యాల, మే 4 : ప్రముఖ శైవక్షేత్రం కొమురవెల్లి మల్లన్న ఆలయ పునరుద్ధరణ కమిటీ పదవీకాలం నేటితో ముగియనుంది. ఈ మేరకు దేవాదాయశాఖ 05-01-2024న జారీచేసిన మెమో నెం.30360/ఎండోమెంట్-2/ ఎ2/2023 ప్రకారం నాలుగునెలల కాలపరిమితి ముగియనుంది. జనవరి7వ తేదీన నిర్వహించిన మల్లన్న కల్యాణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవగా, మూడు నెలల జాతరలో భక్తులకు ఇక్కట్లు కలగకుండా చర్యలు చేపట్టేందుకు 20 మందితో కూడిన రెనవేషన్ కమిటీని నియమించిన విషయం విధితమే. ఏప్రిల్ 8 తేదీన బ్రహ్మోత్సవాలు ముగియడంతో పాటు నేటితో కమిటీ నిర్ణీత గడువు కూడా తీరిపోనుంది.

శల్లాలు కప్పించడం, ప్రసాదం అందించడానికే..

పదేళ్ల అనంతరం కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో రెగ్యులర్ కమిటీని నియమిస్తారని భావించినా అసెంబ్లీ ఎన్నికల కోడ్ అడ్డంకిగా రావడంతో చివరకు రెనవేషన్‌కు పరిమితం చేశారు. ఆలయంలో వివాదాలకు నిలయంగా మారినప్పటికీ జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సూచనలతో పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి కొంతమేర గతానికి భిన్నంగా వ్యవహరించినప్పటికీ పలువురు సభ్యులు మాత్రం జాతర వారాలలో అసలు కానరాలేదు. వచ్చిన వారు తమ అనుయాయుల ఉచిత సేవలో తరించి దర్శనాలు చేయించి శల్లాలు కప్పించడం, లడ్డూ ప్రసాదం అప్పగింపచేయడానికి పరిమితమయ్యారు. అందుకు శల్లాలు, ప్రసాదాలు, వీవీఐపీ దర్శన ఉచిత పాసుల రికార్డులు పరిశీలిస్తే ఎవరెలా వ్యవహరించారన్నది అవగతమవుతుంది. ఇక ఆలయానికి ఎలాంటి విరాళాలు సేకరించకపోగా, తమ వ్యక్తిగత గొప్పలకుపోయి భారంగా మార్చారన్న అపవాదు మూటగట్టుకున్నారు.

ఒక్క చాన్స్ అంటూ..

రెనవేషన్ కమిటీ గడువు ముగియడంతో అధికారపార్టీకి చెందిన నాయకులు అప్పుడే రెగ్యులర్ కమిటీ నియామకంపై దృష్టి సారించి ఆశలపల్లకీలో ఊరేగుతున్నారు. తమకంటూ ఒక్క చాన్స్ ఇవ్వాలని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి వద్దకు పరుగెడుతున్నారు. తమ గాడ్‌ఫాదర్‌లతో సిఫారసులు చేయించుకుంటున్నారు. కొద్ది రోజుల క్రితం నోటిఫికేషన్ వెలువడినప్పటికీ పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో నిలిచిపోయింది. అయితే రెగ్యులర్ కమిటీ నియామకానికి 45 రోజుల ముందు తప్పనిసరిగా నోటిఫికేషన్ జారీ చేయాలన్న నిబంధన ఉండటం, జూన్ 4వ తేదీ వరకు కోడ్ ఉన్నందున కమిటీ నియామకానికి మరో మూడు నెలల సమయం పట్టనుండటంతో నైరాశ్యానికి లోనవుతున్నారు. ఈ విషయమై జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ప్రస్తుత కమిటీలో పలుమార్పులు చేసి కొనసాగింపచేస్తారా.. లేదా ప్రక్షాళన చేపట్టి పార్టీకోసం కష్టపడిన వారికి అవకాశం కల్పించనున్నారా అన్నది ఆసక్తికరంగా మారింది.



కాలనీల రూపురేఖలు మార్చిన ఘనత బీఆర్‌ఎస్‌దే

● ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, మే 4: తాగునీటికి కటకటలాడిన అమీన్‌పూర్ మున్సిపాలిటీలో మిషన్ భగీరథ పథకం ద్వారా నీటి ఎద్దడిని పారద్రోలిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి దక్కుతుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని వెదిరిటౌన్‌షిప్, హెచ్ఎంటీకాలనీ, పీజేఆర్‌కాలనీ, సాయి అంబికాకాలనీ, శ్రీవాణినగర్, జన్మభూమి తదితర కాలనీల్లో పర్యటించారు. ఆయా కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశాల్లో మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలో అమీన్‌పూర్ నీటి ఎద్దడి నివారణకు రూ.110కోట్లతో ఐదు భారీ రిజర్వాయర్లు, పైపులైన్లను వేసినట్లు తెలిపారు. నీటి ఎద్దడికి కేరాఫ్ అడ్రస్‌గా ఉండే అమీన్‌పూర్ నేడు నివాసానికి అత్యంత అనువైన పట్టణంగా మార్చామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డిని ఘనమైన మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఉన్నత విద్యావంతుడైన వెంకట్రామారెడ్డి పార్లమెంట్‌కు వెళ్తే ప్రజా సమస్యలపై కేంద్రంతో కొట్లాడి పెద్ద ఎత్తున నిధులు తెస్తారన్నారు. సమావేశాల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ నర్సింహాగౌడ్, కౌన్సిలర్లు బాశెట్టి కృష్ణ, చంద్రకళ గోపాల్, కల్పనఉపేందర్‌రెడ్డి, బిజిలిరాజు, మహదేవరెడ్డి, రాజేశ్వరి, బీఆర్‌ఎస్ యువత నాయకుల రుశ్వంత్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


అమీన్‌పూర్‌లో మాట్లాడుతున్న మహిపాల్‌రరెడ్డి

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలి

జహీరాబాద్/నారాయణఖేడ్, మే 4: ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు పోస్టల్‌బ్యాలెట్ ద్వారా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని జహీరాబాద్ ఆర్డీవో రాజు పేర్కొన్నారు. శనివారం ఆయన పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాల ఆవరణలో ఏర్పాటుచేసిన పోస్టల్‌బ్యాలెట్ ఓటింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఆర్డీవో రాజు ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల్లో పాల్గొనే ఉద్యోగుల సౌకర్యార్థం ప్రభుత్వ డిగ్రీకళాశాలలో రెండు పోస్టల్‌బ్యాలెట్ ఓటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 4నుంచి 8వ వరకు ఎన్నికల్లో పాల్గొనే ఉద్యోగులు స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్‌బ్యాలెట్ ఓటింగ్ కేంద్రానికి వచ్చి వారి వారి ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. 1,730మంది ఉద్యోగులు పోస్టల్‌బ్యాలెట్‌ద్వార ఓటుహక్కును వినియోగించుకోనున్నారని చెప్పారు. శనివారం 217మంది ఉద్యోగులు ఓటుహక్కును వినియోగించుకున్నారన్నారు. ఖేడ్ మండలం జూకల్ శివారులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో ఉపాధ్యాయులు పోస్టల్ బ్యాలెట్‌తో తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి

● కోహీర్ సర్వసభ్య సమావేశంలో సభ్యుల డిమాండ్

కోహీర్, మే 4: గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఎంపీటీసీలు అధికారులను కోరారు. మండల కేంద్రమైన కోహీర్‌లోని ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ బి.మాధవి అధ్యక్షతన శనివారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీటీసీలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నదని సంబంధిత శాఖ ఏఈని నిలదీశారు. చాలా గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు లేకపోవడం వల్ల ఇబ్బంది ఎదురవుతుందని పేర్కొన్నారు. గ్రామాల్లో మొక్కలు ఎండిపోతున్నా ఉపాధి హామీ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని పేర్కొన్నారు. వచ్చే ఖరీఫ్ సీజన్ కల్లా రైతులకు ఎరువులు, విత్తనాలు సకాలంలో అందుబాటులో ఉంచాలని కోరారు. అంగన్‌వాడా సెంటర్లకు సొంత భవనాలు లేక సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతున్న ఆదర్శ కమిటీ అభివృద్ధి పనులు జూన్ కల్లా పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులను కోరారు. పలు గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే గ్రామాలకు ఆర్టీసీ బస్సుల సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ సర్వసభ్య సమావేశానికి రెవెన్యూ, అటవీ, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ శాఖల అధికారులు హాజరుకాలేదు. సమావేశంలో ఎంపీటీసీలు మల్లన్న పాటిల్, రత్నయ్య, అనిత, శ్రీనివాస్, సమీయోద్దీన్, లావణ్య, భీంసింగ్, కో-ఆప్షన్ సభ్యులు లాయిక్, విద్యుత్ శాఖ ఏఈ మనీష్, ఏంఈవీ శంకర్, ఏపీవో సునందరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తులసి, పశువైద్యాధికారి జీనత్‌భాను, ఏఈవో స్వాతి పాల్గొన్నారు.


సమస్యలపై అధికారులను నిలదీస్తున్న సభ్యులు

వసతుల కల్పనపై దృష్టిపెట్టాలి

● మొగుడంపల్లి ఎంపీపీ ప్రియాంక

జహీరాబాద్, మే 4: ప్రజలకు మౌలిక వసతుల కల్పనలో అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలని ఎంపీపీ ప్రియాంకాగుండారెడ్డి సూచించారు. శనివారం ఆమె అధ్యక్షతన మొగుడంపల్లి మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వివిధ శాఖలకు చెందిన అధికారులు తమ శాఖల ఎజెండా గురించి సభ్యులకు వివరించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. ఎక్కడైనా సమస్యలుంటే ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, ప్రజలు వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చి పనులను పూర్తి చేయించుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం జరుగకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అధికారులు సమావేశానికి రాకపోతే ప్రజల సమస్యలకు పరిష్కారం లభించడమేలా అని ఆమె ప్రశ్నించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతామన్నారు. సమావేశంలో ఎంపీడీవో మహేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ

డిజైర్ సొసైటీ సేవలు అభినందనీయం

జిన్నారం, మే 4: జిన్నారం మండలం బొల్లారం మున్సిపాలిటీలో గల హెచ్ఐవీ బాధిత చిన్నారుల సంరక్షణ కేంద్రం డిజైర్ సొసైటీలో వేసవి శిబిరాన్ని అమెరికా కౌన్సిల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ శనివారం ప్రారంభించారు. హెచ్ఐవీ బాధిత చిన్నారులను చేరదీసి వారికి చికిత్స, విద్యను అందిస్తున్న డిజైర్ సొసైటీ నిర్వాహకులను ఆమె అభినందించారు. గత 18 ఏళ్లుగా సంస్థలో ఉన్న చిన్నారులకు అమ్మనాన్నలుగా అన్ని విధాల సహకారం అందిస్తూ వారి జీవితాలను తీర్చిదిద్దుతున్న తీరును ఆమె ప్రశంసించారు. కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు సంస్థ చిన్నారులు క్లాసిక్ డాన్స్, మేజిక్ షో, మిమిక్రి, మెహింది, టాటు, నెయిల్ పెయింటింగ్ వంటి పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ రవిబాబు పాల్గొన్నారు.


వేసవి శిబిరాన్ని ప్రారంభిస్తున్న అమెరికా కౌన్సిల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్

మెరుగైన వైద్య సేవలు అందించాలి: డీసీహెచ్‌ఎస్

నాగల్‌గిద్ద, మే 4: గ్రామీణ పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీసీహెచ్‌ఎస్ సంగారెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని కరస్‌గుత్తి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించడంతో పాటు రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట సూపరింటెండెంట్ అనురాధ, డాక్టర్ స్వప్న, గిరి, సూపర్ వైజర్ గురుస్వామి ఉన్నారు.

సైబర్ బాధితులకు సత్వరమే న్యాయం చేయండి

● జిల్లా ప్రధాన న్యాయాధికారిని కోరిన జిల్లా ఎస్పీ రూపేష్

సంగారెడ్డి క్రైం, మే 4: సైబర్ నేరాల్లో ఫ్రీజ్ అయిన డబ్బులను వెంటనే బాధితులకు అందేలా చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.భవానీచంద్రను కోరారు. జిల్లా కోర్టులోని ఆమె ఛాంబర్‌లో శనివారం ఎస్పీ మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల బారిన పడి అమాయకులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఫిర్యాదు చేసిన వెంటనే పోలీసుశాఖ స్పందించి సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి పోకుండా డబ్బును ఫ్రీజ్ చేస్తున్నదన్నారు. ఆ డబ్బును వెంటనే బాధితులకు అందేలా చూడాలన్నారు. జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.భవానీ చంద్ర మాట్లాడుతూ.. సైబర్ బాధితులకు సత్వర న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా పోలీసు అధికారులు చొరవ చూపి అధిక మొత్తంలో కేసులు పరిష్కారం అయ్యే విధంగా చూడాలన్నారు. వారివెంట డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రమేష్, కోర్టు లైజనింగ్ అధికారి ఎస్ఐ సత్యనారాయణ ఉన్నారు.

మంజీరా నదిలో గుర్తు తెలియని మృతదేహం


రాయికోడ్, మే 4: రాయికోడ్ మండల పరిధిలోని శిరూర్‌గ్రామ శివారులో గల మంజీరా నదిలో శనివారం గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సిరూర్ గ్రామ శివారులోని మంజీరా నదిలో సుమారు 35 సంవత్సరాల వయస్సున్న యువకుడి మృతదేహాన్ని గుర్తించినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

ప్రభుత్వ భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు

● ఎద్దుమైలారంలో 400 ట్రిప్పుల మొరం తరలింపు

కంది, మే 4: అధికారులంతా ఎన్నికల హడావుడిలో ఉండడంతో అక్రమార్కులు ప్రభుత్వ భూముల్లో మట్టిని కొల్లగొడుతున్నారు. కంది మండల పరిధిలోని ఎద్దుమైలారం సర్వేనెంబర్ 140లోని ప్రభుత్వ భూమిలో దాదాపు 400ట్రిప్పుల మొరం తవ్వి తరలించడం శనివారం గ్రామంలో చర్చనీయాంశమైంది. చుట్టూ పొలాలు ఉన్నా అక్రమార్కులు గుట్టుచప్పుడు కాకుండా గత రెండు రోజుల నుంచి ఓ క్వారీని తలపించేలా తవ్వకాలు జరిపారు. తవ్విన మొరం మట్టిని మొత్తం జుల్‌కల్ శివారులో నిల్వ చేసినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. అక్కడి నుంచి వెంచర్లకుగానీ, భవన నిర్మాణాలకు తరలించే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. ఇదే అదునుగా భావించిన మరికొందరు ఎలాంటి అనుమతులు లేకుండా తమ సొంత పట్టా భూముల్లో సైతం మట్టిని తవ్వి కుప్పలుగా నిల్వలు చేసుకుంటున్నారు. ఈ మట్టి తవ్వకాల వెనుక ఆ గ్రామానికి చెందిన కొందరు రాజకీయ నాయకుల హస్తం ఉన్నదని, వారి ప్రోద్బలంతోనే ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు జరిగాయని గ్రామస్థులు చెబుతున్నారు. ఈ విషయమై కంది తహసీల్దార్ విజయలక్ష్మిని వివరణ కోరగా మట్టి తవ్వకాలు జరిపిన ఎంతటి వారినైనా వదిలే ప్రసక్తే లేదని చెప్పారు. ప్రభుత్వ భూముల్లో అక్రమ మట్టి తవ్వకాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు పెడతామని ఆమె హెచ్చరించారు. ఎద్దుమైలారంలో అక్రమ మట్టి తవ్వకాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.


ఎద్దుమైలారంలో ప్రభుత్వ భూమిలో అక్రమంగా మట్టిని తవ్విన దృశ్యం
















పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల జేఏసీ నాయకులు

పేద వర్గాలపై ఆర్థికభారం మోపిన మోదీ

● ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్, ప్రొఫెసర్ వెంకట్‌నారాయణ

హుస్నాబాద్, మే 4: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం గత పదేళ్లలో కుబేరులను పెంచిపోషిస్తూ పేద వర్గాలపై ఆర్థిక భారం మోపిందని ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్, ప్రొఫెసర్ వెంకట్‌నారాయణ అన్నారు. శనివారం ఆయన హుస్నాబాద్ పట్టణంలోని రిటైర్డు ఉద్యోగుల సంఘ భవనంలో జరిగిన 'ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుందాం-సామాజిక న్యాయం సాధించుకుందాం' అనే కరపత్ర విడుదల కార్యక్రమంలో మాట్లాడారు. దశాబ్ద కాలం నుంచి బీజేపీ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ ఏ ఆర్థిక ప్రయోజనం చేసే పథకాలు అందించకపోవడం శోచనీయమన్నారు. సామాన్య వినియోగదారులపై డీజిల్, పెట్రోల్, గ్యాస్ జీఎస్టీ మొదలకు పన్నులు విధించి రూ.70 లక్షల కోట్లు నిర్దాక్షిణ్యంగా వసూలు చేసిందని ఆరోపించారు. సంపన్నుల అభివృద్ధిని చూసి దేశం అభివృద్ధి అయ్యిందని ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉన్నదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ప్రాంతాన్ని అన్నిరకాల దోపిడీ చేసిందని ఆరోపించారు. బీఆర్ఎస్‌కు ఓటువేయడం అంటే బొందలో వేయడమేనని తెలిపారు. కాంగ్రెస్ నిలబెట్టిన అభ్యర్థులకు ఓటు వేసి రాష్ట్ర సమగ్రాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల జేఏసీ వైస్ చైర్మన్ డాక్టర్ సంఘని మల్లేశ్వర్, ఎడులాపురం తిరుపతి, వంగల సుధాకర్, హుస్నాబాద్ జేఏసీ కో ఆర్డినేటర్ మేకల వీరన్నయాదవ్, తక్కలపల్లి రాజగోపాల్‌రావు, పుల్లూరు సుధాకర్, పొన్నాల ప్రాన్సిస్, లక్ష్మణ్‌గౌడ్, వీరసోమయ్య, రవీంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పెయింటర్ దుర్మరణం

పటాన్‌చెరు, మే 4: రోడ్డు ప్రమాదంలో పెయింటర్ దుర్మరణం పాలైన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. మండల పరిధిలోని బొమ్మన్‌కుంట గ్రామానికి చెందిన ఎర్రోళ్ల శ్రీనివాస్(36) పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం బీరంగూడ నుంచి జానకంపేట వైపు ద్విచక్ర వాహనంపై వస్తుండగా డివైడర్ ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సాయంత్రం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు.



నారాయణరావుపేట రోడ్ షోలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, హాజరైన జనం



హత్నూర మండలం ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి



జగదేవ్‌పూర్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి భరత్‌రెడ్డి

బీజేపీ, కాంగ్రెస్ తెలంగాణకు చేసిందేమీ లేదు

- లిల్లీ పుట్ రేవంత్ సిద్దిపేటకు వచ్చి మొరిగిపోయిండు
- రాజీనామా చేయమంటే తోక ముడిచిండు
- నారాయణరావుపేట ఎన్నికల ప్రచారంలో హరీశ్‌రావు

నారాయణరావుపేట, మే 4: తెలంగాణకు బీజేపీ, కాంగ్రెస్ చేసిందేమీ లేదని, అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేస్తున్నారని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శనివారం నారాయణరావుపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డితో కలిసి రోడ్ షో, ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. ఆరు గ్యారంటీలు, రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తే రాజీనామా చేస్తాను.. నువ్వు చేస్తావా రేవంత్‌రెడ్డి అంటే తోక ముడిచిండన్నారు. సిద్దిపేట అభివృద్ధిని చూసి ఓర్వలేని రేవంత్‌రెడ్డి.. సిద్దిపేటకు మంజూరైన వెటర్నరీ కళాశాలను గద్దలాగా కొడంగల్‌కు ఎత్తుకెళ్లాడని మండిపడ్డారు. సిద్దిపేటకు వచ్చిన లిల్లీ పుట్ ఇష్టం వచ్చినట్లుగా కేసీఆర్‌పై, తనపై విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఒగ్గు బాలకృష్ణ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కోనయ్యగారి ఎల్లయ్య, ఎంపీపీ ఉపాధ్యక్షుడు సంతోష్‌కుమార్, ఎంపీటీసీలు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేసేందుకే వెంకట్రామారెడ్డి పోటీ

హత్నూర, మే 4: ప్రజలకు సేవ చేయాలన్న ఉద్దేశంతోనే మెదక్ పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి బీ.వెంకట్రామారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని నర్సాపూర్ ఎమ్మెల్యే వి.సునితాలక్ష్మారెడ్డి కోరారు. శనివారం ఆమె మండలంలోని రొయ్యపల్లి, శేర్‌ఖాన్‌పల్లి, కొడిపాక, కొత్తగూడెం, నాగారం, ఎల్లమ్మగూడెం, వడ్డేపల్లి, కోనంపేట, చింతలచెరువు, రెడ్డిపాలెం, సాదుల్లానగర్, ముచ్చర్ల, గుండ్ల మాచునూర్ తదితర గ్రామాల్లో వెంకట్రామారెడ్డికి మద్దతుగా కార్మిక సంక్షేమ బోర్డు రాష్ట్ర మాజీ చైర్మన్ దేవేందర్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నర్సింహులు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్ పాల్గొన్నారు.

అమలుకానీ హామీలు ఇస్తున్న రేవంత్‌రెడ్డి

తూప్రాన్, మే 4: సీఎం రేవంత్‌రెడ్డి పిట్టలదొరలాగా అమలుకానీ హామీలు ఇస్తూ ప్రజలను మోసం చేస్తున్నాడని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, గజ్వేల్ నియోజకవర్గ సమన్వయకర్త వేలేటి రాధాకృష్ణశర్మ పేర్కొన్నారు. శనివారం తూప్రాన్ ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆదివారం జరగనున్న హరీశ్‌రావు రోడ్‌షో నిర్వహణను పరిశీలించి, విలేకరులతో మాట్లాడారు. అలాగే తూప్రాన్ మండలం ఘనపూర్‌లోప్రతాప్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు.

తండ్రి కోసం కుమారుడి ప్రచారం..

జగదేవ్‌పూర్, మే 4: బీఆర్ఎస్ మెదక్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి గెలుపు కోసం ఆయన కుమారుడు భరత్‌రెడ్డి జగదేవ్‌పూర్ మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తన తండ్రి వెంకట్రామారెడ్డిని గెలిపించాలని ప్రజలను, ఉపాధిహామీ కూలీలను కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ గుండా రంగారెడ్డి, ఎంపీటీసీ కవితారెడ్డి, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వెంకట్రామారెడ్డిని గెలిపిద్దాం

వెల్దుర్తి, మే 4: బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపిద్దామని జడ్పీటీసీ రమేష్‌గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని ఆయా గ్రామాల్లో పార్టీ మండలాధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, మెదక్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ క్రిష్ణగౌడ్ నిర్వహించారు.

●**ములుగు:** ములుగు మండలం నర్సంపల్లి, అలియాబాద్, అలినగర్, కొట్టాల గ్రామాల్లో ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కొట్టాల గ్రామంలోని ఆలయంలో ముడుపు కట్టారు. మాజీ సర్పంచులు గంగిశెట్టి గణేష్‌గుప్తా, భూపాల్‌రెడ్డి, లక్ష్మి, ఎంపీటీసీ మధుసూదన్‌రెడ్డి, లింగారెడ్డి, మమతాబాల్‌రెడ్డి, జడ్పీటీసీ జయమ్మఅర్జున్‌గౌడ్‌తో కలిసి మాట్లాడారు. కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యమని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యాదగిరిముదిరాజ్ పేర్కొన్నారు. ములుగులో నిర్వహించిన ముదిరాజ్ ఆత్మీయ సమ్మేళనానికి హాజరై మాట్లాడారు.

●**మర్కుక్:** మెదక్‌లో వెంకట్రామారెడ్డిదే విజయమని ఎంపీపీ పాండు గౌడ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని చేబర్తితో పాటు పలు గ్రామాల్లో జడ్పీటీసీ మంగమ్మరామచంద్రం, వైస్ ఎంపీపీ మంద బాల్‌రెడ్డి, తాజా, మాజీ సర్పంచ్ అశోక్ ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు.

●**కంది:** కంది మండలంలోని బేగంపేట, బ్యాతోల్ గ్రామాల్లో శనివారం పార్టీ మండలాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు సాయి గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

●**కుకునూరుపల్లి:** కుకునూరుపల్లి మండల కేంద్రంలోని రాయవరం, బొబ్బాయిపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు.

●**జిన్నారం:** జిన్నారం మండలంలోని లక్ష్మీపతిగూడెంలో జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీటీసీ వెంకటేశంగౌడ్, పార్టీ మండలాధ్యక్షుడు రాజేశ్, నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

●**దౌల్తాబాద్:** మండల కేంద్రంతో పాటు, ఇందుప్రియల్ గ్రామాల్లో జడ్పీటీసీ రణంజ్యోతిశ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సయ్యద్ రహీమొద్దీన్ ప్రచారం నిర్వహించారు. మండల కేంద్రంలోని ఉపాధిహామీ కూలీల వద్దకెళ్లి వెంకట్రామారెడ్డికి ఓటేయాలని కోరారు.

●**గజ్వేల్:** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని 8వ వార్డులో వైస్ చైర్మన్ జకీయొద్దీన్‌తో కలిసి మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వారితో కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య, పట్టణాధ్యక్షుడు నవాజ్‌మీరా ఉన్నారు. గజ్వేల్ మండల పరిధిలోని జాలిగామ గ్రామంలో జడ్పీటీసీ పంగ మల్లేశం, గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉపాధిహామీ కూలీలను కలిసి వెంకట్రామారెడ్డికి ఓటేయాలని అభ్యర్థించారు.

●**చేగుంట:** చేగుంట మండలం కన్యారం, బీమ్‌నగర్‌తండాలో బీఆర్ఎస్ గ్రామ ఇన్‌చార్జి, సొసైటీ వైస్ చైర్మన్ పట్నం తానేష ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా మండలాధ్యక్షుడు ఊరడి యాదగిరి, యూత్ అధ్యక్షుడు ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

●**కొండపాక:** కొండపాక మండలం దమ్మక్కపల్లిలో తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి అనంతల ప్రశాంత్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు.

త్వరలో కేసీఆర్ కుటుంబం జైలుకెళ్లడం ఖాయం: రఘునందన్‌రావు

మనోహరాబాద్, మే 4: త్వరలో కేసీఆర్ కుటుంబం జైలుకెళ్లడం ఖాయమని బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని కాళ్లకల్, కూచారం, మనోహరాబాద్ మండలంలో రోడ్‌షో నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేసీఆర్ గత పదేళ్ల కాలంలో అవినీతి పాలన చేశారని, తెలంగాణ పల్లెల్లో బతుకమ్మ ఆడాల్సిన మా చెల్లెలు కవిత ఢిల్లీలో సారా దందా నిర్వహించి కోట్లు గడించి తీహార్ జైలు పాలైందని ఎద్దేవా చేశారు. కేసీఆర్ చేసిన పాపానికి త్వరలో కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్ జైలుకు వెళ్లడం ఖాయం అన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో హనుమాన్, బంగారమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ ప్రచారంలో బీజేపీ మండలాధ్యక్షుడు నరేందర్‌చారీ, రాష్ట్ర మాజీ సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షుడు నత్తి మల్లేష్‌ముదిరాజ్, రాష్ట్ర నాయకుడు చంద్రశేఖర్ ముదిరాజ్, ఎంపీటీసీ లావణ్య పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరించండి

సంగారెడ్డి రూరల్, మే 4: ఇంటింటికి తిరిగి కేంద్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలని జుగ్గి జోపిడి రాష్ట్ర ప్రముఖ ఆదార్ల మహేష్ బీజేపీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. సంగారెడ్డిలోని బీజేపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

భారీ మెజార్టీతో గెలిపించాలి

కొల్చారం, మే 4: మెదక్ ఎంపీగా బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని బూత్ అధ్యక్షులను ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు రమేష్‌గౌడ్ కోరారు. కొల్చారం మండలం పోతంశెట్‌పల్లి చౌరస్తాలోని హనుమమ్మ గార్డెన్‌లో శనివారం జరిగిన బూత్ అధ్యక్షుల సమావేశంలో మాట్లాడారు.

రఘునందన్‌రావు సతీమణి ప్రచారం..

చేగుంట, మే 4: బీజేపీ మెదక్ అభ్యర్థి రఘునందన్‌రావును గెలిపించాలని ఆయన సతీమణి మంజులాదేవి శనివారం చేగుంటలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అంతకుముందు మహంకాళి ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. మహిళలకు బొట్టు పెట్టి ఓటు అభ్యర్థించారు. ఆమె వెంట బీజేపీ మండలాధ్యక్షురాలు లావణ్య, మండలాధ్యక్షుడు చింతల భూపాల్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు రామచంద్రం ఉన్నారు.

తండ్రి, కొడుకుల ప్రచారం..

నర్సాపూర్, మే 4: రఘునందన్‌రావుకు మద్దతుగా బీజేపీ మాజీ అసెంబ్లీ కన్వీనర్ వాల్దాస్ మల్లేశ్‌గౌడ్, ఆయన కుమారుడు, బీజేవైఎం నియోజకవర్గ అధ్యక్షుడు అరవింద్‌గౌడ్ కొన్నిరోజులుగా నియోజకవర్గంలో ప్రచారం నిర్వహిస్తూ.. రఘునందన్‌రావు గెలుపు కోసం కృషి చేస్తున్నారు.

రఘునందన్‌రావు గెలుపుకోసం కృషి చేయాలి

హవేళిఘణపూర్, మే 4: రఘునందన్‌రావు గెలుపుకోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ తెలిపారు. మండల పరిధిలోని భూర్గుపల్లిలో మండల కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు.



మనోహరాబాద్ మండలం కాళ్లకల్ రోడ్ షోలో మాట్లాడుతున్న బీజేపీ మెదక్ అభ్యర్థి రఘునందన్‌రావు

●**ములుగు:** ములుగు మండలం అన్నాసాగర్ గ్రామంలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా జనరల్ సెక్రెటరీ కట్ట భాగ్యలక్ష్మి రఘునందన్‌రావు గెలుపు కోసం ఉపాధి కూలీలను కలిసి ఓటు అభ్యర్థించారు.

●**దౌల్తాబాద్:** మండల పరిధిలోని ముబారస్‌పూర్‌లో బీజేపీ మండల నాయకులు ఉపాధిహామీ కూలీల వద్దకు వెళ్లి రఘునందన్‌రావుకు ఓటేసి గెలిపించాలని కోరారు.

●**రాయపోల్:** రాయపోల్ మండలం వీరారెడ్డిపల్లిలో పనిచేస్తున్న ఉపాధిహామీ కూలీలకు బీజేపీ మండలాధ్యక్షుడు రాజాగౌడ్, నాయకులు రామకృష్ణ, రొయ్యల శ్రీను, ప్రవీణ్ బటర్ మిల్క్ ప్యాకెట్లు, అరటిపండ్లు అందజేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో నరేంద్రమోదీకి మద్దతు ఇవ్వాలని, కమలం పువ్వు గుర్తుపై ఓటేయాలని విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

● కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి కొండా సురేఖ



రామచంద్రాపురం: తెల్లాపూర్ కౌన్సిలర్ భరత్‌కుమార్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి



కొండాపూర్: మంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి

సంగారెడ్డి టౌన్/రామచంద్రాపురం/కొండాపూర్:, మే 4: బీఆర్ఎస్ సంగారెడ్డి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి మంత్రి కొండా సురేఖ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. శనివారం సంగారెడ్డిలోని ఓ ఫంక్షన్‌హాలులో జరిగిన కార్యక్రమంలో ఆయన ఉద్యమకారులతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. స్వరాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ కోసం పనిచేసేందుకు ఉద్యమకారులమంతా కాంగ్రెస్‌లో చేరినట్లు వెల్లడించారు. రామచంద్రాపురంలో జరిగిన కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపాలిటీ కౌన్సిలర్ భరత్‌కుమార్ మంత్రి కొండా సురేఖ, డీసీసీ ప్రెసిడెంట్ నిర్మలాజగ్గారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్సీ ఆర్.సత్యనారాయణ, మాజీ కో ఆప్షన్ మెంబర్ అమీనోద్దీన్, ప్రభాకర్, లక్ష్మణ్, కాట శ్రీనివాస్ గౌడ్ ఉన్నారు. సంగారెడ్డిలోని పీఎస్ఆర్ గారెన్స్‌లో శనివారం రాత్రి సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా మంత్రి కొండా సురేఖ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ఉద్యమకారులను అణగదొక్కడమే కాకుండా బలిదానాలు చేసిన ఒక్క కుటుంబానికి కూడా ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వలేదని మండిపడ్డారు. ఈ సమావేశంలో టీఎస్ఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చుక్కా రాములు, మాజీ ఎమ్మెల్సీ ఆర్.సత్యనారాయణ, పులిమామిడి రాజు ఉన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

● రూ.5,49,000 లక్షల నగదు పట్టివేత

మెదక్ అర్బన్/జహీరాబాద్/చేర్యాల/జగదేవ్‌పూర్, మే 4: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో భారీగా నగదు పట్టుబడుతున్నది. శనివారం పలు మండలాల్లో రూ.5,49,000 లక్షల నగదు పోలీసుల తనిఖీల్లో పట్టుబడింది. మెదక్ పట్టణంలో వెల్‌కం బోర్డు వద్ద శనివారం వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా.. (టీఎస్ 08 కేజీ 7438) నెంబరు గల కారులో ఎలాంటి రశీదు లేకుండా తరలిస్తున్న రూ.2 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ దిలీప్‌కుమార్ తెలిపారు. కేసు నమోదు చేసి జిల్లా గ్రీవేన్స్ సెల్ కార్యాలయానికి తరలించినట్లు ఆయన వెల్లడించారు. మొగుడంపల్లి మండలంలోని మాడ్గి చెక్‌పోస్టువద్ద శనివారం వాహనాల తనఖీల్లో భాగంగా రూ.1.50 లక్షలను పట్టుకున్నామని చిరాగ్‌పల్లి ఎస్ఐ నరేష్ తెలిపారు. గుల్బర్గాకు చెందిన ప్రేమలత కారులో రూ.1.50 లక్షలను హైదరాబాద్‌కు తరలిస్తున్న క్రమంలో పట్టుకున్నామని తెలిపారు. నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లని కారణంగా సీజ్‌చేసి, ఎన్నికల అధికారులకు అప్పగించామన్నారు. చేర్యాల మండలం గుర్జకుంట చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు నిర్వహిస్తున్న వాహన తనిఖీలో శనివారం రూ.54 వేల నగదు పట్టుకుని సీజ్ చేశారు. ధూళిమిట్ట మండలం హనుమంతుతండాకు చెందిన భూక్యా సురేశ్ కారును తనిఖీ చేయగా, అతడి వద్ద రూ.54 వేలు పట్టుబడ్డాయి. ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఆయనవెంట ఎస్ఐ దామోదర్ ఉన్నారు. మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లో పోలీసులు నగదు పట్టుకున్నారు. జగదేవ్‌పూర్‌లో స్టాటికల్ సర్వేలెన్సు టీమ్ సిబ్బందితో కలిసి జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ నిర్వహిస్తుండగా స్టేషన్ ఘనపూర్‌కు చెందిన కుమార్ వద్ద రూ.1,45,000 లక్షలను పట్టుకున్నామని ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు.



చేర్యాల మండలం గుర్జకుంట చెక్‌పోస్ట్ వద్ద పట్టుబడిన నగదును సీజ్ చేస్తున్న పోలీసులు

దేశాభివృద్ధి మోదీతోనే సాధ్యం: బీబీ పాటిల్

తాడ్వాయి/సదాశివనగర్/లింగంపేట/రామారెడ్డి, మే 4: దేశాభివృద్ధి మోదీతోనే సాధ్యమని బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్ అన్నారు. శనివారం ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని తాడ్వాయి, సదాశివనగర్, లింగంపేట, రామారెడ్డి మండలాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆప్ కీ బార్ చార్‌సౌ పార్‌లో అందరూ భాగస్వామ్యం కావాలని తెలిపారు. ఈ పదేళ్లలో మోదీ ప్రభుత్వం సహకారంతో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని, ఇంకా పెండింగ్ పనులను పూర్తి చేయాల్సి ఉన్నదని తెలిపారు. కాంగ్రెస్ హామీ ఇచ్చిన గ్యారెంటీలపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లిందని, మోదీ గ్యారెంటీపై ప్రజల్లో ఆదరణ లభిస్తుందని తెలిపారు.

దేశాభివృద్ధి కోసం బీజేపీని గెలిపించండి

నాగిరెడ్డిపేట, మే 4: దేశాభివృద్ధి మోదీతోనే సాధ్యమని, దేశ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ బీజేపీకి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని జహీరాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ ఓటర్లను కోరారు. ఆయన శనివారం సాయంత్రం నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో రోడ్ షో కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి నేరేళ్ల అంజనేయులు, మాజీ ఎమ్మెల్యే గంగారాం, బీజేపీ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తలను బెదిరిస్తే ఊరుకునేది లేదు

ఎల్లారెడ్డి, మే 4: ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ కార్యకర్తలను, ప్రజలను బెదిరిస్తే ఊరుకునేది లేదని కేంద్రంలో మా ప్రభుత్వం ఉందని జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ అన్నారు. శనివారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో స్ట్రీట్ కార్నర్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదన్ మోహన్ తనపై వ్యక్తిగత విమర్శలు చేయడం ప్రజలు గమనిస్తున్నారని, పదేళ్లుగా ప్రజల కోసం పనిచేస్తున్నానని నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని అన్నారు. ఈ సమావేశంలో బాణాల లక్ష్మారెడ్డి, కృష్ణారెడ్డి, పైడి కృష్ణారెడ్డి, నేరెళ్ల ఆంజనేయులు, ఎల్లారెడ్డి బీజేపీ నాయకులు నర్సింహులు, దేవేందర్, నరేష్, ఎస్ఎన్‌రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్‌ను గెలిపిద్దాం

జహీరాబాద్, మే 4: జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా బరిలో ఉన్న బీబీపాటిల్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని బీజేపీ జిల్లా నాయకుడు బక్కయ్యగుప్తా పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని మాణిక్‌ప్రభు మహేశా, నాగులకట్ట తదితర ప్రాంతాల్లో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. దేశవ్యాప్తంగా ప్రజలు నరేంద్రమోదీ నాయకత్వాన్ని కోరుతున్నారని గుర్తుచేశారు. బీబీపాటిల్ గెలుపుకోసం అందరం సంఘటితమై సైనికుల్లా పనిచేయాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అశోక్‌బెల్కేరీ, అరుణ్‌కుమార్, అప్పం శ్రవణ్, సోమ అనిల్, సంతోష్, శోభారాణి, అర్చనా సారడా పాల్గొన్నారు.



ప్రచారంలో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్

జూన్ 8న జాతీయ లోక్ అదాలత్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి

సిద్దిపేట క్రైం, మే 4: జూన్ 8న సిద్దిపేట జిల్లా కోర్టు ఆవరణలో జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి తెలిపారు. శనివారం సిద్దిపేట జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్‌లో క్రిమినల్, కాంపౌండబుల్ సివిల్, చెక్ బౌన్స్, మోటర్ వాహనాల కేసుల్లో రాజీ కుదిరిచ్చి అధిక మొత్తంలో కేసులు రాజీ పడేటట్లు చూడాలని పోలీస్ అధికారులకు సూచించారు.

లేగదూడపై చిరుత దాడి



మృతిచెందిన లేగదూడను పరిశీస్తున్న అధికారులు

హవేళిఘణపూర్, మే 4: చిరుత దాడిలో లేగదూడ మృతిచెందింది. హవేళిఘణపూర్ మండలంలోని బొగుడ భూపతిపూర్‌కు చెందిన వంకాయల సాయిలు తన పశువులను శుక్రవారం మేతకు తీసుకెళ్లి సాయంత్రం పాకలో కట్టేశాడు. శనివారం ఉదయం వెళ్లి చూడగా లేగదూడ చనిపోయి ఉన్నది. వెంటనే ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించాడు. చిరుతనే చంపేసిందని అధికారుల నిర్ధారించారు.

అస్వస్థతకు గురైన కార్మికుడు చికిత్స పొందుతూ మృతి

● నష్ట పరిహారం చెల్లించాలని కంపెనీ ఎదుట కుటుంబీకుల ఆందోళన ● రూ.6 లక్షలు ఇచ్చేందుకు అంగీకరించిన యాజమాన్యం

మాసాయిపేట, మే 4: తీవ్ర అస్వస్థతకు గురైన కార్మికుడు చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతిచెందాడు. మాసాయిపేటకు చెందిన పెరుమాండ్ల వెంకటేశం(47) స్థానికంగా ఉన్న నోవెల్ ఎక్ పరిశ్రమలో దినసరి కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం పరిశ్రమలోని ఫీడ్ ప్లాంట్ వద్ద తీవ్ర అస్వస్థతకు గురై పడిపోయాడు. వెంటనే సంబంధిత లేబర్ కాంట్రాక్టర్ వెంకటేశంను చికిత్స నిమిత్తం తీసుకెళ్లాలని కొందరు సహ కార్మికులను పంపించినట్లు కంపెనీవర్గాలు తెలిపాయి. శుక్రవారం సాయంత్రం తీవ్ర అస్వస్థతకు గురై అపస్మారకస్థితికి చేరుకోవడంతో కుటుంబీకులు సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతిచెందినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా



వెంకటేష్(ఫైల్)

పరిశ్రమ వద్ద మృతుడి కుటుంబీకులు ఆందోళన చేపట్టారు. ఆర్థిక సహాయం అందజేయాలని భీష్మించి కూర్చున్నారు. చివరికి గ్రామ పెద్దలు కంపెనీ వర్గాలతో చర్చించి మృతుడి కుటుంబానికి రూ.6 లక్షలు ఇచ్చేందుకు అంగీరించినట్లు గ్రామస్థులు తెలిపారు.

జింకపిల్లను గాయపరచిన కుక్కలు

● రక్షించి ఫారెస్ట్ అధికారులకు అప్పగించిన రైతు



జింకపిల్లను అటవీ శాఖ సిబ్బందికి అప్పగిస్తున్న రైతు

రాయపోల్, మే 4: జింకపిల్లను కుక్కల దాడి నుంచి రక్షించి ఫారెస్ట్ అధికారులకు రైతు అప్పగించాడు. ఈ సంఘటన రాయపోల్‌లో శనివారం చోటుచేసుకున్నది. రాయపోల్ గ్రామ శివారులో పంట పొలాల వద్ద జింకపిల్లపై ఊరకుక్కలు దాడికి దిగాయి. ఇది గమనించిన రైతు ఆంజనేయులు కుక్కలను తరిమేసి జింకపిల్లను రక్షించాడు. అనంతరం అటవీశాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చాడు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని రైతు నుంచి జింకపిల్లను స్వాధీనం చేసుకున్నారు. కుక్కల దాడిలో జింకపిల్ల గాయపడగా, అటవీ శాఖ అధికారులు అనాజీపూర్ పశు వైద్య ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. అనంతరం జింకపిల్లను సిద్దిపేటలోని పార్కుకు తరలించినట్లు ఫారెస్ట్ సెక్షన్ అధికారి హైమద్ హుస్సేన్ తెలిపారు.

చలువపందిళ్ల ఏర్పాటు



రాజగోపురం వద్ద చలువపందిరి

చేర్యాల, మే 4: వేసవి దృష్ట్యా కొమురవెల్లి మల్లన్న దర్శనార్థం వచ్చే భక్తులకు నిలువ నీడ కరువై ఇబ్బందులు పడుతున్న విషయమై ఇటీవల ఆంధ్రజ్యోతిలో 'మండుటెండల్లో మల్లన్న భక్తుల ఇక్కట్లు' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆలయాధికారులు స్పందించారు. ఈ మేరకు శనివారం ఆలయ రాజగోపుర ఆవరణలో చలువపందిళ్లు ఏర్పాటు చేయించారు. రాజగోపురప్రాకారం నుంచి రోడ్డు వరకు పందిళ్లు ఏర్పాటు చేయించాలని కోరుతున్నారు.

వేసవి క్రీడా శిబిరం.. విద్యార్థులకు వరం

● డీవైఎస్‌వో ఆధ్వర్యంలో రామంచ హైస్కూల్లో వాలీబాల్ ఉచిత శిక్షణ
● ఈ నెల 31 వరకు కొనసాగనున్న శిక్షణ శిబిరం

చిన్నకోడూరు, మే 4: పాఠశాలలకు వేసవి సెలవులు ఇచ్చారు. క్రీడల్లో ఆసక్తి ఉన్న విద్యార్థులు తమ నైపుణ్యాలకు పదును పెట్టేందుకు ఈ వేసవి సెలవులు చక్కని అవకాశం. వేసవి సెలవుల్లో శిక్షణ తీసుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదిగిన వారు ఎంతో మంది ఉన్నారు. విద్యార్థులు సెలవులను సద్వినియోగం చేసుకునేలా జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని రామంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వాలీబాల్ క్రీడాకారులకు ఉచిత వాలీబాల్ క్రీడా శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామీణ క్రీడాకారులకు ఈ శిబిరం ఎంతగానో ఉపయోగ పడనుంది. ఈ ఉచిత శిక్షణ ఈనెల 1న ప్రారంభం కాగా ఈ నెల 31 వరకు కొనసాగనుంది. ఈ శిక్షణ ప్రతీ రోజు ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు ఉంటుంది. ఈ ఉచిత శిక్షణకు రామంచ గ్రామంతో పాటు, చుట్టు పక్కల గ్రామాల విద్యార్థులు 70 మంది, విద్యార్థినులు 30 మంది కలిపి మొత్తం 100 మంది హాజరవుతున్నారు.



వాలీబాల్ వ్యాయామాలను చేస్తున్న విద్యార్థులు



విద్యార్థులకు సూచనలు ఇస్తున్నకోచ్

వాలీబాల్ మెళకువలపై ప్రత్యేక శిక్షణ

ఈ శిక్షణ శిబిరంలో విద్యార్థులకు రన్నింగ్, వార్మ్ ఆప్, వాలీబాల్ క్రీడాకు సంబంధించిన ప్రత్యేకమైన వ్యాయమాలపై శిక్షణ ఇస్తున్నారు. వీటితోపాటు వాలీబాల్ క్రీడాకు సంబంధించిన నైపుణ్యాలు అప్పర్ హమ్ పాస్, అండర్ హమ్ పాస్, లోయర్ హమ్ పాస్, సింపుల్ సర్వీస్, టెన్నిస్ సర్వీస్, సైడ్ హమ్ సర్వీస్, జంప్ సర్వీస్, సెట్టింగ్, డిఫెన్స్, స్ట్రైకింగ్, సైడ్ ఫ్రంట్ డైవ్స్, స్టాడింగ్, రోటేషన్ సిస్టమ్ తదితర వాటిపై తర్ఫీదు ఇస్తున్నారు.

వాలీబాల్ శిక్షణకు బాలికలు సైతం

వేసవి శిబిరానికి హాజరయ్యే 100 మంది విద్యార్థుల్లో 30 మంది విద్యార్థినులు ఉండటం విశేషం. విద్యార్థినులు వాలీబాల్ క్రీడాపై ప్రత్యేక శ్రద్ధ చూపించడమే కాకుండా బాలురకు దీటుగా సాధన చేస్తున్నారు. వాలీబాల్‌లో రాణించేందుకు అవసరమైన మెళకువలు నేర్చుకుంటూ సాధన చేస్తున్నారు.

మెళకువలు నేర్చుకుంటా



వేసవి సెలవుల్లో వాలీబాల్‌పై పట్టు సాధించేందుకు మెళకువలు నేర్చుకుంటా. శిక్షణలో వ్యాయామ ఉపాధ్యాయుడు నేర్పించే అంశాలను నిత్యం సాధన చేస్తున్నాను. భవిష్యత్‌లో జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో రాణించాలనే లక్ష్యంతో సాధన చేస్తున్నా.
-తేజశ్రీ, రామంచ, చిన్నకోడూరు మండలం

వాలీబాల్ అంటే నాకు ఆసక్తి



మాది నారాయణరావుపేట మండలం గుర్రాలగొంది గ్రామం వాలీబాల్ క్రీడా అంటే నాకు ఆసక్తి. ఈ క్రీడలో శిక్షణ ఇస్తున్నారని తెలిసి కుటుంబసభ్యుల ప్రోత్సాహంతో ఈ శిబిరంలో చేరాను. ఆటకు సంబంధించిన మెళకువలు నేర్చుకుంటున్నా.
- చరణ్, గుర్రాలగొంది, నారాయణరావుపేట మండలం

పట్టు సాధించేలా శిక్షణ



విద్యార్థులు శిక్షణలో క్రీడా మెళకువలు నేర్చుకోని, నిర్విరామంగా సాధన చేస్తే ఉన్నత స్థాయికి చేరేందుకు అవకాశం ఉంటుంది. విద్యార్థులతో పాటు, విద్యార్థినులు ఈ క్రీడాపై ఆసక్తి పెంచుకుంటున్నారు.
- ఉప్పలయ్య, శిక్షకుడు (సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు), రామంచ హైస్కూల్

అంగన్‌వాడీల్లో ప్రైవేట్‌కు దీటుగా బోధన

● దుబ్బాక సీడీపీవో చంద్రకళ



మాట్లాడుతున్నదుబ్బాక సీడీపీవో చంద్రకళ

దౌల్తాబాద్, మే 4: అంగన్‌వాడీల్లో ప్రైవేట్‌కు దీటుగా చిన్నారులకు బోధన చేస్తున్నామని ఐసీడీఎస్ దుబ్బాక ప్రాజెక్టు సీడీపీవో చంద్రకళ అన్నారు. శనివారం మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామ రైతువేదికలో ఐసీడీఎస్ దుబ్బాక ప్రాజెక్టు ఆధ్వర్యంలో చిన్నారులకు ప్రీస్కూల్ వార్షికోత్సవ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ.. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రతీ సంవత్సరం ఆఖరి రోజున పిల్లలకు ఆట, పాట, కథలు, అభ్యాసన, శారీరక, మానసిక ఎదుగుదల, నైపుణ్యాలను వెలికి తీయడానికే ప్రీస్కూల్ వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. అంగన్‌వాడీల్లో చిన్నారులు నేర్చుకున్న విషయాలను వారి తల్లిదండ్రుల ఎదుట ప్రదర్శించారు. అనంతరం పిల్లలకు ప్రోగ్రెస్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు అనురాధ, గిరిజ, అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో చిల్డ్రన్ క్యాంపు



విద్యార్థులకు బోధన చేస్తున్న యజ్ఞానంద స్వామి

జగదేవ్‌పూర్, మే 4: బాల, బాలికలకు వేసవి శిబిరం ఎంతో దోహదపడుతుందని చిన్మయ మిషన్ స్వామిజీ యజ్ఞనంద అన్నారు. ప్రతి సంవత్సరం చిన్మయ మిషన్ జగదేవ్‌పూర్ శాఖ ఆధ్వర్యంలో వేసవి శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని, ఈ శిబిరంలో విద్యార్థులకు రామాయణం, మహాభారత కథలతో పాటు సృజనాత్మకు సంబంధించిన మెళకువలను, భజన, ఆటపాటలతో పాటు సంగీతానికి సంబంధించిన ప్రాథమిక అంశాలను నేర్పిస్తున్నామన్నారు. విద్యార్థులకు చిన్నప్పటి నుంచే నైతిక విలువలతో కూడిన విద్య అందించినట్లయితే ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గౌతమి, ఉషా, చైతన్య, మిషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని దించుకోవాలి

● సివిల్ సప్లయ్ మేనేజర్ హరికృష్ణ



రైస్‌మిల్ యజమానితో మాట్లాడుతున్నహరికృష్ణ

కొల్చారం, మే 4: రైతులకు ఇబ్బందులు రాకుండా ధాన్యాన్ని దించుకోవాలని జిల్లా సివిల్ సప్లై మేనేజర్ హరికృష్ణ రైస్‌మిల్లర్లకు సూచించారు. కొల్చారం మండల పరిధిలోని దుంపలకుంట వద్ద ఉన్న ఓ పారాబాయిల్డ్ రైస్‌మిల్‌ను శనివారం పరిశీలించి రైస్‌మిల్ యజమానితో మాట్లాడారు. సీఎంఆర్ త్వరితగతిన పూర్తి చేస్తే గోదాంలో స్థల సమస్య ఉండదన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

● డీసీహెచ్‌ఎస్ సంగారెడ్డి



సిబ్బందితో మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్ సంగారెడ్డి

నాగల్‌గిద్ద, మే 4: గ్రామీణ పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీసీహెచ్‌ఎస్ సంగారెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని కరస్‌గుత్తి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యశాలలోని పలు రికార్డులను పరిశీలించడంతో పాటు రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట సూపరింటెండెంట్ అనురాధ, స్వప్న, ఫార్మసిస్ట్ గిరి, సూపర్‌వైజర్ గురుస్వామి పాల్గొన్నారు.

పాఠశాలకు తాగునీటి ట్యాంకుల బహుకరణ

● వాసవి క్లబ్ గవర్నర్ చేతుల మీదుగా అందజేత

సంగారెడ్డి అర్బన్, మే 4: సంగారెడ్డి పట్టణం రాజంపేటలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు వాసవి క్లబ్స్ సంగారెడ్డి ఆధ్వర్యంలో శనివారం తాగునీటి ట్యాంకులను బహుకరించారు. వాసవి క్లబ్ జిల్లా గవర్నర్ భానురి నర్సింహులు చేతుల మీదుగా ట్యాంకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ సీనియర్ ఉపాధ్యక్షుడు చంద్రశ్రీధర్, కేబినెట్ కార్యదర్శి మురళీధర్, విద్యాసాగర్, శ్రీనివాస్, భాస్కర్, వెంకటేశం, పద్మ, సుమంత్, రాజు, చంద్రశేఖర్, రాజమల్లయ్య, హన్మంత్, కవిత, సవిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రంగంపేట ఆశ్రమంలో శతరుద్రాభిషేకం



మహాలింగానికి అభిషేకం చేస్తున్న మాధవానంద సరస్వతి స్వామి

కొల్చారం, మే 4: కొల్చారం మండల పరిధిలోని రంగంపేట ఆశ్రమంలో శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శతరుద్రాభిషేకం నిర్వహించారు. మాధవానంద సరస్వతి స్వామి హాజరై మహాలింగానికి అభిషేకం నిర్వహించారు. ఈ ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

6న బసవేశ్వర విగ్రహావిష్కరణ

రేగోడు మే 4: రేగోడులోని బసవేశ్వరచౌక్ వద్ద విశ్వగురు మహాత్మా బసవేశ్వర విగ్రహాన్ని ఈనెల 6న పీఠాధిపతులచే ఆవిష్కరిస్తామని వీరశైవ లింగాయత్ సంఘం నాయకులు శనివారం తెలిపారు. ఈ విగ్రహావిష్కరణ మహోత్సవానికి బిచ్కుంద పీఠాధిపతి సోమలింగ శివాచార్య మహారాజ్, బాల్కి బసవ కల్యాణ్ పీఠాధిపతి బసవలింగ పట్టాదేవరు హాజరుకానున్నట్లు తెలిపారు. ఉదయం బసవేశ్వరుని శోభయాత్ర నిర్వహించి అనంతరం విగ్రహావిష్కరణ, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పోస్టర్ ఆవిష్కరణ

జహీరాబాద్, మే 4: పట్టణంలోని మెథడిస్ట్ చర్చి ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి 19 వరకు నిర్వహించే క్రైస్తవ ఉజ్జీవసభల పోస్టర్‌ను ఉత్సవ కమిటీ సభ్యులు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతియేటా అల్లీపూర్‌లోని గార్డెన్‌నగర్‌లో మెథడిస్ట్ చర్చి పరిసర ప్రాంతాల్లో జాతర ఉత్సవాలను రెండురోజుల పాటు ఘనంగా నిర్వహిస్తామన్నారు. సాంస్కృతిక, తదితర కార్యక్రమాలను చేపడుతామన్నారు. ఈ ఉత్సవాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. కార్యక్రమంలో రెవ.కెఎల్. జాన్‌వెస్లీ, జిల్లా లేలీడర్ సరీన్‌జాన్, జిల్లా సెక్రెటరీ వై. రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబాన్ని పరామర్శించిన వంటేరు

జగదేవ్‌పూర్, మే 4: జగదేవ్‌పూర్ మండలంలోని తిగుల్ గ్రామానికి చెందిన కందుకూరి వెంకటేష్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, ఆ విషయం తెలుసుకున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి వారి కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ కామల్ల భూమయ్య, సీనియర్ నాయకులు దయానందరెడ్డి, కోటయ్య, శ్రీరాంరెడ్డి తదితరులు ఉన్నారు.

అంబేడ్కర్,పూలే సేవా సమితి సభ్యుల నియామకం

నారాయణఖేడ్, మే 4: అంబేడ్కర్, పూలే సేవా సమితి ఖేడ్ ఏరియా కార్యాలయంలో శనివారం సంఘం డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్‌రహీం, ప్రధాన కార్యదర్శి పండరీల పాల్గొన్నారు. వారి సమక్షంలో సంఘం నాగల్‌గిద్ద మండల శాఖ అధ్యక్షుడిగా గణేష్, ప్రధాన కార్యదర్శిగా శివానంద్‌లను ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు బైండ్ల కృష్ణ తెలిపారు. నాగల్‌గిద్ద మండలంలోని రైతులు, మహిళలు, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం చేసే పోరాటాల్లో తమ వంతు కృషి చేస్తామని నూతనంగా నియమితులైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గణేష్, శివానంద్‌లు తెలిపారు. ఈ సమావేశంలో సంఘం డివిజన్ అధ్యక్షుడు నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దే ఓటేసిన వృద్ధులు

వెల్దుర్తి , మే 4: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలకు వెళ్లలేని 85 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు ఇంటివద్దే ఓటు హక్కును వినియోగించుకున్నారు. శనివారం ప్రత్యేకంగా నియమించిన ఎన్నికల సిబ్బంది వారి వద్దకు వెళ్లగా.. 22 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. కార్యక్రమంలో ప్రొసిడింగ్ అధికారిణి రాజేశ్వరి, ఏపీవో కళావతి, రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

PLOT FOR SALE
★ గజ్వేల్ టౌన్ మెయిన్ రోడ్డు, ఎస్‌బిఐ దగ్గర, 161 చ.గ. ఇంటి స్థలం అమ్మబడును. సంప్రదించగలరు. సెల్ నం: 8143366630/ 9989554915 AJH-5275

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

భువనగిరికి తరలివెళ్లిన సీపీఐ నాయకులు



చేర్యాల నుంచి తరలివెళ్తున్న సీపీఐ నాయకులు

చేర్యాల, మే 4: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో సీపీఐ ఆధ్వర్యంలో శనివారం భువనగిరి పట్టణంలోని ఓ కన్వెన్షన్‌హాల్‌లో నిర్వహించిన సీపీఐ సభకు, చేర్యాల నుంచి ఆ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యవర్గసభ్యుడు అందె అశోక్, ఈరు భూమయ్య, జంగిలి యాదగిరి, రామగల్ల నరేశ్, పొన్నబోయిన మమత తదితరులు తరలివెళ్లారు.

ఆత్మగౌరవ సభకు తరలివెళ్లిన నాయకులు



గజ్వేల్ నుంచి తరలివెళ్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గజ్వేల్, మే 4: హైదరాబాద్ ఇందిరాపార్కు చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో, చేపట్టిన మాదిగల ఆత్మగౌరవ సభకు గజ్వేల్ నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు తరలివెళ్లారు. ఎమ్మార్పీఎస్ గజ్వేల్ అసెంబ్లీ కన్వీనర్ శనిగరి రమేశ్ మాదిగ ఆధ్వర్యంలో యువతీ, యువకులు పెద్ద ఎత్తున తరళివెళ్లారు. వారితో పాటు ఎమ్మార్పీఎస్ నాయకులు దబ్బెట రవి, ఎర్ర మధు, బెజుగామ రాజు, ఎర్ర రాజు, దబ్బెట సుమన్, శనగారి శేఖర్, రఘు, బాబీ, శ్రీహరి, శివ, మహేశ్, దిలీప్, ప్రవీణ్, దయాకర్, జశ్వంత్ తదితరులున్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

గజ్వేల్, మే 4: గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను, ఎకనామిక్స్ బోధించుటకు గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఏ.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఎస్సీ, ఎస్టీలైతే ఎకనామిక్స్‌లో 50శాతంతో, బీసీ, ఓసీలైతే 55శాతంతో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే నెట్, సెట్ పాసైన వారికి, పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి ప్రాధానం ఉంటుందని తెలిపారు. ఈ నెల 6న ఉదయం 11గంటలకు ఇంటర్వ్యూ, డెమో క్లాసుల ద్వారా ఎంపిక ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు అన్ని ధ్రువీకరణ పత్రాలు, ఒక సెట్ జీరాక్సుతో హాజరు కావాలని సూచించారు.

రేబర్తి జీపీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభించిన పంచాయతీ కార్యదర్శి

మద్దూరు, మే 4: మండలంలోని రేబర్తి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీ సెక్రటరీ మాధవ్‌జాదవ్ తెలిపారు. శనివారం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో గ్రామస్తుల దాహార్తిని తీర్చడానికి ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆశాలు యశోద, కవిత, కనకలక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీ పట్టివేత

గజ్వేల్, మే 4: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీసులు పట్టుకున్నారు. ప్రజ్ఞాపూర్ రాజీవ్ రహదారిపై ఎలాంటి ప్రభుత్వ అనుమతి, వేబిల్ లేకుండా అక్రమంగా ఇసుకను హైదరాబాద్‌కు తరలిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో, పోలీసులు పట్టుకున్నారు. టీఎస్ 02 యూడీ 9959 నెంబరు గల లారీని పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గజ్వేల్ సీఐ తెలిపారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు మాట్లాడుతూ.. ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక, రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తే వెంటనే 8712667445, 8712667446, 8712667447 నెంబర్లకు సమాచారం అందించాలని, సమాచారం అందిచిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

'మొక్కల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి'

చేర్యాల, మే 4: వేసవి దృష్ట్యా మొక్కలు ఎండిపోకుండా సంరక్షించాలని కొమురవెల్లి ఎంపీడీవో ఎ. కుమారస్వామి అన్నారు. కొమురవెల్లి మండలం మర్రిముస్త్యాల గ్రామంలోని నర్సరీని శనివారం ఆయన పరిశీలించారు. మొక్కల సంరక్షణతో పాటు అవెన్యూ మొక్కలు ఎండిపోకుండా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసి ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని కార్యదర్శికి సూచించారు.

వైభవంగా భద్రకాళీ పూజ, గరుడ సేవ



కొండపాక: దుద్దెడ పెద్దమతల్లికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

గజ్వేల్, మే 4: గజ్వేల్ పట్టణంలోని పురాతన శ్రీసీతారామ, ఉమామహేశ్వరాలయ స్వామివారల బ్రహోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రంతా అంగరంగ వైభవంగా భద్రకాళీ పూజను నిర్వహించారు. ఆలయ పూజారి మఠం శివకుమార్ నేతృత్వంలో పూజరులు అట్టహాసంగా భద్రకాళీ పూజను నిర్వహించారు. శనివారం ఉదయం అగ్నిగుండాలు దాటే కార్యక్రమాన్ని నిర్వహించగా, పెద్ద ఎత్తున భక్తులు హాజరై అగ్నిగుండాలను దాటారు. అనంతరం స్వామి వారికి గరుడ సేవ నిర్వహించారు. పట్టణంలోని ఆలయం నుంచి అంగడిపేట హనుమాన్ ఆలయం వరకు డప్పుచప్పుళ్ల మధ్య గరుడ సేవను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నవితరణ చేశారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

దుద్దెడ పెద్దమ్మతల్లి ఆలయంలో పూజలు

కొండపాక, మే 4: మండలంలోని దుద్దెడలో ఉన్న పెద్దమ్మతల్లి ఆలయ పంచమ వార్షికోత్సవంలో భాగంగా జరుగుతున్న ఉత్సవాల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, బీఆర్‌ఎస్ మెదక్ పార్లమెంటు అభ్యర్థి వెంకట్రామారెడ్డి శనివారం సాయంత్రం పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు వారికి ఘనస్వాగతం పలికి సత్కరించారు. వారివెంట బీఆర్‌ఎస్ నాయకులు లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, అనంతల ప్రశాంత్, మాజీ ఉపసర్పంచ్ గుండెల్లి ఆంజనేయులు, పెద్దింకుల శ్రీనివాస్, బాలాజీ, జైపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు. అంతకుముందు ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి ఆలయంలో పూజలు చేశారు.



గజ్వేల్: సీతారామ ఉమామహేశ్వరాలయంలో అగ్నిగుండాలను దాటుతున్న భక్తులు

బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరికలు



బీజేపీలో చేరిన వారికి కండువా కప్పుతున్న బండి సంజయ్

బెజ్జంకి, మే 4: మండలంలోని వీరాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు గన్నమనేని సుధీర్‌రావుతో పాటు పలువురు కార్యకర్తలు బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో, కరీంనగర్‌లో బండి సంజయ్ సమక్షంలో శనివారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా బండి సంజయ్ వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి

సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యం



గజ్వేల్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ బెల్దే కృష్ణాగౌడ్

గజ్వేల్, మే 4: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని వైస్ ఎంపీపీ బెల్దే కృష్ణాగౌడ్ సూచించారు. గజ్వేల్ మండల సర్వసభ్య సమావేశం ఆయన అధ్యక్షతన శనివారం నిర్వహించారు. గజ్వేల్ మండల పరిధిలోని ఆయా శాఖల అధికారులు తమ శాఖకు సంబంధించిన ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా చూడాలని, ఉపాధిహామీ కూలీలకు ఓఆర్‌ఎస్, నీడ కల్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ప్రవీణ్, ఎంపీవో దయాకర్, వ్యవసాయాధికారి నాగరాజు గుండు, ఎంఈవో సునిత, నీటిపారుదల శాఖ ఏఈ శ్రీనివాస్, ఎంపీటీసీలు అరిగే అశోక్‌కుమార్, ఆంజనేయులు, దమ్మని రాజేశ్వరీ, బూర్గుపల్లి రాజిరెడ్డి, ఏఈవోలు గణేశ్ గౌడ్, సౌజన్య, మౌనిక తదితరులున్నారు.

లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుంటే తప్పులకు తావుండదు

● ప్రొఫెసర్ వెల్దండి నిత్యానందరావు



వార్షికోత్సవంలో భాగంగా నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

గజ్వేల్, మే 4: విద్యార్థులు జీవితంలో నిర్దేశిత లక్ష్యం ఏర్పాటు చేసుకుంటే తప్పులకు తావుండదని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ వెల్దండి నిత్యానందరావు అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల 15వ వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు జీవితంలో మంచి స్థాయిలో ఉండాలంటే క్రమశిక్షణ, ఓర్పు, ఉదత్తత, సంయమనం, మంచి ఆలోచన విధానం ఉండాలని, మనిషిని మనిషిగా గుర్తించాలని, ధర్మంతో మెలగాలన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ పీవీ ఉమాశశి మాట్లాడుతూ.. విద్యార్థినిలు 84శాతం ఉత్తీర్ణత సాధించారని, కళాశాల అధ్యాపకుల కృషి అమోఘం అన్నారు. అనంతరం కళాశాలలో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులను గోల్డ్ మెడల్స్‌తో సత్కరించారు. కళాశాల విద్యార్థినిలు చేసిన నృత్యాలు అందరిని అలరించాయి. వారితో గజ్వేల్ మునిసిపల్ చైర్మన్ రాజమౌళి, విశ్రాంత ప్రిన్సిపాల్ పద్మావతి అధ్యాపకులు శైలజ, సీపీడీపీ సభ్యులు పరమేశ్వరాచారీ, టీ.లక్ష్మణ్, టీ.మధుసూదన్ తదితరులున్నారు.



ప్రశంసాపత్రాలను చూపుతున్న విద్యార్థినులు